క్లుప్తంగా

నిబంధనలు విస్మరించడం తగదు



దేవరుప్పుల: ప్రభుత్వ నిబంధనలు విస్మరించి డబుల్‌బెడ్రూం ఇళ్లలో ఇష్టానుసారంగా చేరడం తగదని తహసీల్దార్ హుస్సేన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో కస్తూర్బా హాస్టల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న జర్నలిస్టుల ఇళ్లలో పలువురు అక్రమంగా చేరిన విషయమై తహసీల్దార్, హౌజింగ్, పోలీసు యంత్రాంగం అక్కడకు చేరుకొని లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. హౌజింగ్ ఈఈ దామోదర్‌రావు, నాయబ్ తహసీల్దార్ నవీన్‌కుమార్, ఆర్‌ఐ రాజు, ఇన్‌చార్జ్ ఏఈ విద్యాసాగర్, పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై ఎస్ చెన్నకేశవులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయంలో వేలం



బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్ధేశ్వరాలయంలో పలు హక్కులకు వేలంపాట నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో వేలం పాటలను నిర్వహించిన అనంతరం వంశీ మాట్లాడారు. లడ్డూ, పులిహోర రూ. 2.75 లక్షలకు వరంగల్‌కు చెందిన ప్రవీణ్ పాట దక్కించుకోగా, తలనీలాల సేకరణ హక్కును రూ.2.32 లక్షలకు కొడవటూర్ గ్రామానికి చెందిన నడిగొట్టు సురేశ్ వేలంలో దక్కించుకున్నారని చెప్పారు. హక్కుదారుల కాల వ్యవధి సంవత్సరం ఉంటుందన్నారు. ఈ వేలం నిర్వహణకు దేవాదాయ ధర్మాదాయ శాఖ భువనగిరి డివిజన్ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి పర్యవేక్షణ అధికారిగా హాజరు కాగా ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, జూనియర్ అసిస్టెంట్ చల్ల రాజేందర్‌రెడ్డి, మధు, లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగం భానుప్రకాష్‌రెడ్డి, అర్చకులు సంఘమేశ్వర్, మహాశివుడు పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైనది

స్టేషన్‌ఘన్‌పూర్: వైద్యులు దైవంతో సమానమని, సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని శివునిపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి అన్నారు. స్థానిక మోతె హాస్పిటల్‌లోని వైద్యులు మోతె రాజు, నాగరాజు, మోతె రాజయ్యను శివునిపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు మంగు జయప్రకాష్, హరిప్రసాద్, బత్తిని సురేందర్, పిట్టల మహేందర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు



కొడకండ్ల: గ్రామాల్లోని సమస్యలు తెలుసుకొని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. మండలంలోని నర్సింగాపురం గ్రామంలో ప్రధాన సమస్యలను పరిశీలించి స్థానిక నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో తాగునీరు, సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీలు, అసంపూర్తిగా నిల్చిపోయిన పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు సోమనర్సయ్య, రవిందర్, అంజయ్య, రంగయ్య, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దేవరుప్పుల: సీజనల్ వ్యాధుల నివారణపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రాజపురి రవితేజ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆశ వర్కర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో గ్రామాల్లో పరిశుభ్రత ఉండేలా పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓ వెంకటస్వామి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

జనగామ రూరల్: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని ఓబుల్ కేశవాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పగిడిపల్లి నర్సయ్యకు చెందిన ఆవు తన వ్యవసాయబావి వద్ద గడ్డి మేస్తుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ.80వేల విలువ గల ఆవు మృతి చెందడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

రైతుల అభిప్రాయాలకు ప్రాధాన్యం



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్



రఘునాథపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ మేకల వరలక్ష్మి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌జీ

జఫర్‌గఢ్: రైతు భరోసా అమలు విషయంలో రైతుల అభిప్రాయాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఎంపీపీ రడపాక సుదర్శన్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో స్థానిక రైతు వేదికలో రైతు భరోసా అమలు తీరుతెన్నులపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ రైతు భరోసా అమలు విషయంపై రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారని అన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డి, ఏఓ చంద్రన్ కుమార్, డైరెక్టర్లు కొత్త సాంబరాజు, గద్దం రాజు, కడారి యాకయ్య, నాగరాజు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసా 20 ఎకరాలకు పరిమితం చేయాలి

రఘునాథపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయబోయే రైతు భరోసాను కనీసం 20 ఎకరాల వరకు పెట్టుబడి సాయం అందించాలని ఎంపీపీ మేకల వరలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నిడిగొండ రైతువేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. మెజార్టీ రైతులు పది ఎకరాలకే రైతు భరోసా అమలు చేయాలని కోరగా, కొంత మంది రైతులు ఐదు ఎకరాలకే పరిమితం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు, రాజకీయ నాయకులకు, గుట్టలకు, వెంచర్లకు రైతు భరోసా అమలు చేయొద్దని రైతులు కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రాథమిక సహకార సంఘాల అడిటర్ మురళి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ దివ్య, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, విండో వైస్ చైర్మన్ బొక్క చంద్రబాబు, ఏఈఓ సుస్మిత, డైరెక్టర్లు గొట్టం కరుణాకర్‌రెడ్డి, పసులాది దానయ్య, మాజీ సర్పంచ్ పెద్దగోని అంజయ్య, మాలరాజు, మడ్లపల్లి రాదాకృష్ణ, ఎలపాటి రాంరెడ్డి, గాజులపాటి వీరోజీ, బొంగు ఐలయ్య, మైలారపు ఆంజనేయులు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణ

మండలంలోని కంచనపల్లి రైతు వేదికలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా అమలుపై రైతుల సలహాలు, సూచనలపై సమావేశం నిర్వహించారు. అధికారులు.. రైతు భరోసా ఎన్ని ఎకరాలకు ఇవ్వాలని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా పది ఎకరాల వరకు ఇవ్వాలని మెజార్టీ రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్‌జీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన రైతులందరికి రైతు భరోసా ఇవ్వనుందని, ఎన్ని ఎకరాలకు ఇవ్వాలనేది రైతుల అభిప్రాయాల మేరకే సర్కార్ నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ దివ్య, పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్‌జీ, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓలు కళ్యాణి, స్వాతి, విండో వైస్ చైర్మన్ మూడ్ ధర్మా, డైరెక్టర్లు అయిత జయరాములు, మహేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: మండలంలోని బండ్లగూడెం, సిరిపురం రైతు వేదికల్లో ఈ నెల 3న రైతు భరోసాపై రైతుల అభిప్రాయాల సేకరణకు ప్రత్యేక మహాజన సభ నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల రైతులంతా బండ్లగూడెం రైతు వేదికలో హాజరు కావాలని కోరారు. అదేవిధగా పీఏసీఎస్ పరిధిలోని గ్రామాలు సిరిపురం రైతు వేదికల సమావేశాలకు హాజరై రైతుభరోసాపై తమ అభిప్రాయాలను తెలుపాలని కళ్లెం పీఏసీఎస్ సీఈఓ మల్లేశం తెలిపారు.

పాలకుర్తి: పాలకుర్తి మండలంలోని ఈరవెన్ను రైతు వేదికలో నేడు (బుధవారం) పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ తీసుకోనున్నట్లు సీఈఓ రణధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయాధికారిగా వినోద్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

సన్మానం

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లిలో ఎంపీటీసీ సుల్తాన్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తూముకుంట్ల సురేందర్‌రెడ్డిలను కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ప్రజా ప్రతినిధులుగా గ్రామానికి వారు చేసిన సేవలను కొనియాడారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నామాల బుచ్చయ్య, మాజీ ఎంపీపీ దాసరి అనిత, నిమ్మ రాంరెడ్డి, కుర్ర రాజు, అంబటి రాజమౌళి, వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, పర్శరాములు, ఖాజాపాషా, రామయ్య, వేణు, రాములు, ఎల్లస్వామి పాల్గొన్నారు.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి



చిల్పూరు: గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప దాడులు, ప్రతిదాడులకు దిగితే శిక్షలు తప్పవని రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్ అన్నారు. డీసీపీ (వెస్ట్ జోన్) రాజమహేంద్రనాయక్ ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్‌లు మండలంలోని కొండాపూర్ గ్రామంలోని 139 సర్వే నంబర్‌లో వివాదస్పద వ్యవసాయ భూములను మంగళవారం బాధిత రైతులతో కలిసి పరిశీలించారు. భూసమస్యల విషయంలో అనవసర వివాదాలకు తావివ్వొద్దని సూచించారు. మాజీ సర్పంచ్ లోడెం రజితరవీందర్, గాలి రాజు, గాలి ప్రవీణ్, గూళ్ల ప్రకాష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

జనగామ: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ఆశ కార్యకర్తలు పని చేయాలని సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్ సూచించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వానాకాలం సమయంలో ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. డయేరియా నివారణ మహోత్సవం నేపథ్యంలో ఈ మాసంలో ప్రతిరోజూ ఇంటింటినీ సందర్శించి ఓఆర్‌ఎస్ ద్రావణం గురించి తెలియజేస్తూ, ఐదేళ్ల లోపు పిల్లలకు డయేరియా నివారణ జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ రమాదేవి, సూపర్ వైజర్ ఉపేంద్ర, ఏఎన్‌ఎంలు అనిత, ఉపేంద్ర, స్వప్న, మనెమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న ఆశ కార్యకర్తలు

బీఆర్‌ఎస్ పాలనలో కుంటుపడిన అభివృద్ధి



పాలకుర్తి టౌన్: బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఝాన్సీ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహకారంతో నియోజకవర్గం సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల ఆదినారాయణ, గాదెపాక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ అనిత

జనగామ: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాల అమలులో మార్పు మొదలైందని 17వ వార్డు కౌన్సిలర్ జక్కుల అనిత వేణుమాధవ్ అన్నారు. మంగళవారం వార్డు పరిధిలోని జూబ్లీ ఫంక్షన్‌హాల్ ప్రాంతంలో రూ.5లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం వార్డు అధ్యక్షుడు కమాలుద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ హయాంలో వార్డు ప్రజలకు అవసరమైన ఏ ఒక్క పని చేయలేకపోయామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల కాలంలోనే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.125 కోట్ల నిధులను తీసుకొచ్చారని తెలిపారు. ఇందులో జనగామ పట్టణంలోని వార్డుల అభివృద్ధి కోసం రూ.25 కోట్లు కేటాయించారన్నారు.

గ్రామీణ పాఠశాలల్లోనే ఆణిముత్యాలు



దేవరుప్పుల: గ్రామీణ పాఠశాలల్లోనే ఆణిముత్యాలు తయారవుతాయని శంకరాచార్య సేవాసమితి నిర్వాహకుడు బెహరా రవికాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి బీఆర్‌తండా పాఠశాలకు సేవాసమితి ఆధ్వర్యంలో రూ.15 వేల విలువ గల స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిల్స్, నోటు బుక్స్ అందజేశారు. కాగా, పాఠశాల యాజమాన్య కమిటీ రవికాంత్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. సేవా సమితి సభ్యులు దాక్ష్యాయని జయంతి,రామ లక్ష్మి, జయంతి, హెచ్‌ఎం తాటి జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ రేణుక, సూర్యతేజ, జ్యోతి పాల్గొన్నారు.

దండోరా రజతోత్సవాలను జయప్రదం చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్: చాటింపులు, పెళ్లిళ్లు, చావులకు పరిమితమైన మాదిగల హక్కుల దండోరా ఉద్యమం మొదలై 30 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా నిర్వహించే దండోరా రజతోత్సవాలకు మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతి నిధి, ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, దళిత రత్న నీరటి ప్రభాకర్‌మాదిగ కోరారు. ఈనెల 7న హైదరాబాద్ రవీంద్రబారతిలో నిర్వహించనున్న దండోరా రజతోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పొరునంది రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడారు. రజతోత్సవ సభకు విద్యావంతులు, మేధావులు, ప్రొఫెసర్లు, లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, టీచర్లు, కవులు, కళాకారులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పొరునంది రమేష్, జిల్లా ఇన్‌చార్జ్ మేడ స్వామి, నీరటి ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సీవీఎస్ చారికి డాక్టరేట్



దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన చిలుమోజు వెంకట నర్సింహ్మాచారి (సీవీఎస్)కి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి మంగళవారం డాక్టరేట్ పట్టా పొందారు. ప్రస్తుతం మహిళా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు టి.కృష్ణకుమార్ పర్యవేక్షణలో ఏ స్టడీ ఆఫ్ సెలక్ట్ మైక్రో స్మాల్ అండ్ మీడియం స్కేల్ ఇండస్ట్రీయల్ పర్మెమెన్స్ ఇన్ వరంగల్ జిల్లా అనే అంశంపై పరిశోధన చేశారు. వికలాంగత్వం కలిగిన చారి విద్యావలంటీర్ నుంచి విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ ఉమ్మడి జిల్లా అభ్యున్నతికి ఆలోచన చేసేలా పరిశోధనాత్మకతలో ప్రతిభ కనబర్చడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఫొటో గ్రాఫర్స్ మండల కమిటీ ఎన్నిక

పాలకుర్తి: ఫొటో గ్రాఫర్స్ పాలకుర్తి మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా రాపోలు రాము, ప్రధాన కార్యదర్శిగా గజ్జి రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పట్వారి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్స్ మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎడవెల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా గుడికందుల నరేష్, కార్యదర్శిగా గజ్జి రాజు. సహాయ కార్యదర్శిగా చిన్నబోయిన అశోక్, కోశాధికారిగా చిలుమల బాబు, కార్యవర్గ సభ్యులుగా రమణ సుధాకర్, పున్నతుల స్వామి, ఇల్లందుల అశోక్, ఎలిగేటి సోమన్న, కొత్తూరి మధులు ఎన్నికయ్యారు. లక్ష్మణ్, సంజయ్, ప్రదీప్, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించేందుకు అర్హులు ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 6, 8వ తరగతులకు ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధిస్తే జీతం గంటల చొప్పున అందించనున్నట్లు చెప్పారు. డిగ్రీ, బీఈడీ పూర్తిచేసిన వారు ఈ నెల 5వ తేదీన పాఠశాలలో ఉదయం 11 గంటలకు నిర్వహించే డెమో క్లాసులకు హాజరు కావాలని అన్నారు.

ఆర్థికసాయం

కొడకండ్ల: రోడ్డు ప్రమాదంలో రామవరం గ్రామ పంచాయతీ కారోబార్ నాగయ్య మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీతోపాటు నాయకులు పరామర్శించి రూ.18వేల సాయం మంగళవారం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

పాలకుర్తి టౌన్: విద్యుత్ శాఖ పాలకుర్తి రూరల్ ఏఈగా బోయిన సత్తయ్య మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండల ఏఈగా పని చేసిన సత్తయ్య బదిలీపై పాలకుర్తి రూరల్ ఏఈగా నియమితులయ్యారని ఆ శాఖ ఏడీ బాలగంగాధర్ తిలక్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సత్తయ్యను సిబ్బంది సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అర్బన్ ఏఈ అవిరినేని రణధీర్, లైన్‌మన్ వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

దేవరుప్పుల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఊరూరా జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

బియ్యం వితరణ

జనగామ రూరల్: పట్టణానికి చెందిన నామాల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. కాగా లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి పీఆర్‌సీలు మంగళవారం బియ్యం అందజేశారు. పీఆర్‌సీలు శ్రీరాం శ్రీనివాస్, ఏనుగు నర్సిరెడ్డి, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరి నారు ధ్వంసం

జనగామ రూరల్ : పొలం వద్ద వరి నారు పోయగా అడవి పందులు ధ్వంసం చేశాయని మండలంలోని కొర్రతండాకు చెందిన కొర్ర శంకర్ మంగళవారం తెలిపారు. రెండున్నర ఎకరాలకు నాలుగు ప్యాకెట్స్ వరి విత్తనాలు కొనుగోలు చేసి నారు పోసినట్లు చెప్పాడు. పెరుగుదల దశకు చేరుకుంటుండగా అడవి పందులు తొక్కడంతో పూర్తిగా ధ్వంసమైందని, చుట్టూ పందులు రాకుండా కర్రలతో చీరలుతో రక్షణ ఏర్పాటు చేసినా ఉపయోగం లేదన్నారు.

అదుపుతప్పిన కారు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల కారు గుట్ట ఎక్కుతుండగా అదుపుతప్పింది. సికింద్రాబాద్ దమ్మాయిగూడేనికి చెందిన వీవీ నాగేందర్ కుటుంబ సభ్యులతో బుగులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కారులో వచ్చారు. కాగా గుట్ట ఎక్కుతున్న క్రమంలో రోడ్డుపక్కన ఉన్న బండరాళ్లను ఢీకొని గుంతలో కారు దిగబడింది. స్థానికులు వచ్చి కారును గుంతలోంచి బయటికి తీశారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

రఘునాథపల్లి: ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో మంగళవారం బీజేవైఎం మండల అధ్యక్షుడు బొల్ల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట పార్టీ యూత్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి వల్లాల ఉపేందర్, జిల్లా అధికార ప్రతినిధి మంద వెంకటేశంయాదవ్ మాట్లాడారు. గ్రూపు-1 మెయిన్స్‌కు 1:100 రేషియో ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూపు-2, గ్రూపు-3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ పురం యుగేందర్‌కు అందజేశారు. మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, నాయకులు వెంకట్‌రెడ్డి, రంజిత్, వాసుదేవరెడ్డి, ఉపేందర్, అఖిల్, మహేష్, కిషన్, రాజు, భిక్షపతి, ఉదయ్ పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

నర్మెట: రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదలచేసి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు డిమాండ్ చేశారు. బీజేవైఎం రాష్ట్రశాఖ పిలుపుమేర తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం నిరసన తెలిపిన అనంతరం తహసీల్దార్ ఎం.మహిపాల్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి సొక్కం అనిల్‌కుమార్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ధరావత్ విజయ్, అధికార ప్రతినిధి రాజబోయిన శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు ధరావత్ వినోద్, ప్రధాన కార్యదర్శి బైకాని రంజిత్, కార్యదర్శి మెతుకు సిద్దులు, దళితమోర్చా మండల అధ్యక్షుడు కొమురెల్లి, నారాయణరెడ్డి, ప్రభాకర్, కిరణ్, సుధాకర్, శివ, మహేష్ పాల్గొన్నారు.



రఘునాథపల్లి: వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కొడకండ్లలో..

కొడకండ్ల: రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ అంజయ్యకు వినతిపత్రం సమర్పించారు. సురేష్, అంజనేయులు, ఉమేష్, కమలాకర్, హరీష్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కె.శరత్‌కుమార్, జిల్లా కార్యదర్శి పూంద్రు నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నాయబ్ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు అందజేశారు. బీజేపీ జిల్లా నాయకుడు గట్టు కృష్ణ, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మొండిచేయి చూపడం తగదు

దేవరుప్పుల: ఉద్యోగ, ఉపాధి కల్పన పేరిట యువత ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండిచేయి చూపే చర్యలు తగవని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ విమర్శించారు. బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరుద్యోగుల సమస్యలపై తహసీల్దార్ ఐలపురం హుస్సేన్‌కు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్య, బీజేవైఎం జిల్లా కోశాధికారి గుంటి అజయ్, భిక్షపతి, ఇనుముల యాకన్న, శంకర్ నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



నర్మెట: నిరసన తెలుపుతున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు



పాలకుర్తి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తహసీల్దార్‌కు వినతి..

చిల్పూరు: బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్ కార్యాలయం ఎదుట నాయకులు నిరసన చేపట్టి డీటీ విమలకు వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు ఉపేందర్‌యాదవ్, తోట రంజిత్‌కుమార్, చీమల వినయ్‌యాదవ్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాలకుర్తి: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం నాయకులు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాణా ప్రతాప్, మండల నాయకులు గోనె అమరేంద్, బత్తూరి శ్రవణ్, గుగ్గిళ్ల సురేష్, బీజేపీ మండల అధ్యక్షులు దుంపలి సంపత్, మాజీ అధ్యక్షుడు కమ్మగాని శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆటో-కారు ఢీ.. నలుగురికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: ముందు వెళ్తున్న ఆటోను కారు వెనకనుంచి ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని రాఘవాపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ ముస్కె రాజు తెలిపిన వివరాలు ప్రకారం.. రఘునాథపల్లి మండలం మల్లంపల్లికి చెందిన గుర్రం సుధాకర్ ఆటోలో అదే గ్రామానికి చెందిన కంకటి రమేశ్, తాళ్లపల్లి సల్మాన్, అలుగోజు రాములు మల్లంపల్లి నుంచి ఘన్‌పూర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో జనగామ నుంచి హనుమకొండకు వస్తున్న కారు ఆటోను వెనుకనుంచి ఢీకొట్టడంతో రోడ్డు పక్కకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సుధాకర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న రమేశ్, సల్మాన్, రాములు గాయపడ్డారు. సీఐ ముస్కె రాజు పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆటో డ్రైవర్ మామ జి.రాములు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ మహ్మద్ సక్యూబ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.